



## విరించి

# సెకండ్ ఇన్నింగ్స్

ఆర్డీవో ఆనందరావంటే తూగో జిల్లాలో తెలియని వారెవరూ ఉండరు. గుమాస్తా స్థాయి నుంచి ఆర్డీవో స్థాయి వరకు అంచెలంచెలుగా ఎదిగిన ఆనందరావంటే పెద్ద భూస్వాములకు, వ్యాపారులకు, పారిశ్రామికవేత్తలకు అందరికీ అభిమానమే. ఆనందరావు వల్ల లబ్ధి పొందని వాళ్లు ఎవరూ లేరు. అధికారుల్లో, రాజకీయ వర్గాల్లో ఆనందరావు పలుకుబడి అపారమైనది. ఏ పనైనా ఇంత మొత్తానికి ఒప్పుకున్నాడంటే ధైర్యంగా చేసేస్తాడు. అతని డివిజన్లో ఉన్న తహసిల్దార్లందరికీ అతనే పెద్ద దిక్కు.

అలాంటి ఆనందరావుకు ఈ రోజే రిటైర్మెంట్. ఆనందరావు కంటే ఆశ్రితులందరికీ ఎక్కువ బాధగా ఉంది. డివిజన్లోని తహసిల్దార్లు, కాంట్రాక్టర్లు అందరూ రిటైర్మెంట్ ఫంక్షన్ ఘనంగా చేయాలని నిర్ణయించుకున్నారు. పెద్ద ఎ.సి.ఫంక్షన్ హాలు, కేటరింగ్, వీడియో, గార్లాండ్స్, బొకేలు అన్నీ రెడీ అయ్యాయి. అన్ని పేపర్లలలో పదవీ విరమణ శుభాకాంక్షలు వెల్లువలా వచ్చాయి.

సాయంత్రం ఏడయ్యింది. అప్పుడప్పుడే వేసవి కాలం చీకటి కమ్ముకుంటోంది. రంగు రంగుల దీపాల వెలుగులో ఫంక్షన్ హాలు వెలిగిపోతోంది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వగైరా పెద్ద అధికారులు, యం.ఎల్.ఎ. వగైరా రాజకీయ నాయకులు ఒక్కొక్కరు మందీ మార్బలంతో వస్తున్నారు.

ఫంక్షన్ ప్రారంభం కాగానే ఆనందరావు సతీసమేతంగా వేదిక మీద ఆశీనులయ్యాడు. వారితో పాటే పెద్దలందరూ, వక్తలంతా ఆనందరావు సామర్థ్యాన్ని, నిజాయితీని పొగుడుతున్నారు. ఆ తర్వాత ఒక్కొక్కరు పూలదండలు, పూలగుర్తులు, గిఫ్టులు, బట్టలతో సత్కరించారు. ఫోటోలు, వీడియోలు సరేసరి. ఆ కార్యక్రమం అయి, భోజనాలయ్యేటప్పటికి రాత్రి పది దాటింది. ఆనందరావు అందరికీ షేక్‌హేండ్ ఇచ్చాడు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దొరగార్లు వెళ్లిపోయారు. ఆనందరావు ఇంటికి జేరేటప్పటికి రాత్రి పదకొండు.

ఉదయం ఆనందరావు చాలా ఆలస్యంగా నిద్ర లేచాడు. హడావుడిగా ఆఫీస్‌కెళ్లాల్సిన అవసరం లేదు. ఫైల్లు చూడాల్సిన పని లేదు. కలెక్టర్ గారి నుంచి కబురులేదు. గుమ్మంలో సర్కారు వారి కారు లేదు. బిళ్లబంట్రోతు లేదు. బంగ్లాకొచ్చి మాట్లాడే తహసీల్దారులు, భూస్వాములు, రాజకీయ నాయకులు ఎవరూ లేరు. చదీచప్పుడు లేదు. ఇల్లు చాలా ప్రశాంతంగా ఉంది.

కప్పు కాఫీ అడుగుదామంటే భార్య అనసూయ పూజలో ఉంది. కాఫీ కలుపుకోవడం కూడా తనకు రాదు. హాల్లో పచార్లు చేశాక అరగంట తర్వాత భార్య కాఫీ కప్పుతో వచ్చింది.

"త్వరగా కాఫీ ఇవ్వొచ్చుగా!" ఆలస్యం అయినందుకు అసహనంగా అన్నాడు ఆనందరావు.

"ఇప్పుడు ఆఫీసు లేదుగా! ఏమిటి అర్జెంటు?" నవ్వుతూ అన్నా ఆనందరావుకు చురుక్కుమంది.

హాల్లోకొచ్చి ఆ రోజు పేపర్లు తిరగేశాడు. టీవీ ఆన్ చేశాడు. దేని మీదకూ మనస్సు పోవడం లేదు. రోజూ ఉండే హడావుడి ఒక్కసారి చప్పబడిపోవడం అతను జీర్ణించుకోలేకపోతున్నాడు. నిన్నటి దాకా "అయ్యగారూ... దొరగారూ" అంటూ తిరిగే బిళ్ల బంట్రోతు ఈ ఒక్కరోజైనా వచ్చి వెళ్లొచ్చుగా. ఒక రకమైన మిక్స్‌డ్ ఫీలింగ్స్‌తో ఉన్నాడు. తను హేపీగా రిటైరయ్యాడు. రిటైరైతే పి.ఎఫ్, గ్రాట్యుటీ అన్నీ కలిపి ఓ ఇరవై లక్షలదాకా వచ్చింది. తనా తరతరాలకు సరిపడే సంపాదించాడు. లంకంత ఇల్లు. కూతురు డాక్టర్, కొడుకు సాఫ్ట్‌వేర్. ఇద్దరూ పెళ్లిళ్లు అయి కుటుంబాలతో అమెరికాలో ఉన్నారు. అయినా తను హేపీగా ఉన్నాడో, అన్‌హేపీగా ఉన్నాడో అర్థంకావడంలేదు ఆనందరావుకి.

"నమస్కారం సార్!" ఆలోచనల్లోంచి ఈ లోకంలోకి వచ్చాడు ఆనందరావు. ఎదురుగా తహసిల్దార్ సత్యమూర్తి. సత్యమూర్తికి ముక్కుకు సూటిగా పోయే మనిషని, నిజాయితీ పరుడని, పరోపకారని మంచి పేరుంది.

ఆనందరావుకు అతన్ని చూడగానే చాలా ఆనందం కలిగింది.

"రా! సత్యమూర్తి" అన్నాడు ఆదరంగా.

ఇద్దరూ సోఫాలో కూర్చున్నారు.

సత్యమూర్తి కూడా ఆనందరావు వయస్సు వాడే. వచ్చే నెలే రిటైర్మెంటు.

"విష్ యూ హేపీ రిటైర్డ్ లైఫ్ సార్" అన్నాడు సత్యమూర్తి.

"థాంక్యూ సత్యమూర్తి! నిజానికి హేపీయే. నాకు ఏ బర్డెన్స్ లేవు. డబ్బు ఇబ్బంది లేదు. అనారోగ్య సమస్యలు లేవు. ఏ టెన్షన్ లేదు. అయినా రిటైర్మెంట్ అనగానే ఏదో చెప్పలేని ఫీలింగ్...ఒక విధమైన అన్‌హేపీనెస్"

"సార్! మీకు చెప్పేటంత గొప్పవాడ్ని కాదు. కానీ ఒకటి చెప్పనా?"

"చెప్పు!"

"ముప్ఫై ఏళ్లుగా మీకు మందిమార్బలం, అధికారం, హోదా అలవాటయిపోయాయి. అవునా?"

"అవును"

"అన్నీ ఉన్నా 'అవి లేవు' అన్న ఫీలింగే సంతోషాన్ని మీకు దూరం చేస్తోంది" అన్నాడు సత్యమూర్తి.


"అబ్బే, అదేం లేదు" ఒప్పుకోదానికి ఆనందరావుకు అహం అడ్డొచ్చింది.

"మనిషి ఓ తొంభైయేళ్ల బ్రతుకుతాడనుకుంటే మొదటి పాతిక ముప్ఫై సంవత్సరాలు చదువు, ఉద్యోగం... తన కోసమే బ్రతుకుతాడు. ఆ తర్వాత పెళ్లి, భార్యాపిల్లలు- మరో ముప్ఫై సంవత్సరాలు వాళ్ల కోసం బ్రతుకుతాడు. మరి మనిషి సమాజం కోసం బ్రతికేది ఎప్పుడు సార్? ఈ సమాజం హాయిగా ఉంటేనే కదా మనం హాయిగా ఉండేది. జీవన పోరాటం 'ఒన్ డే మ్యాచ్' కాదు సార్. రెండు ఇన్నింగ్స్‌ల టెస్ట్ మ్యాచ్. మీరు ఆడింది 'ఫస్ట్ ఇన్నింగ్స్' మాత్రమే. రిటైర్మెంట్ తర్వాత గడిపేది 'సెకండ్ ఇన్నింగ్స్'. ఇప్పుడే మీరు మీకు నచ్చిన విధంగా బ్రతకొచ్చు. సమాజానికి సాధ్యమైన సేవ చెయ్యొచ్చు. సహాయం చెయ్యడంలో ఉన్న ఆనందాన్ని పూర్తిగా అనుభవించొచ్చు" అన్నాడు సత్యమూర్తి.

"నువ్వు చెప్పింది బాగానే ఉంది. ఇప్పటిదాకా ఎంతో మానసిక, శారీరక ఒత్తిడిలో పని చేసి ఏం సేవ చేయగలను?" అన్నాడు ఆనందరావు.

"సర్! ఒక్క నెల్లాళ్లు మీకు ఎలా ఎంజాయ్ చెయ్యాలనిపిస్తే అలా చెయ్యండి. ఆ తర్వాత నేను కూడా రిటైరయిపోతా. అప్పుడు చెప్పండి రిటైర్డ్ లైఫ్ ఎలా ఉందో" అన్నాడు సత్యమూర్తి.

ఆనందరావు ఇచ్చిన కాఫీ తాగి, కరచాలనం చేసి బయటపడ్డాడు సత్యమూర్తి.



ఆనందరావు మళ్లీ ఒక్కడూ మిగిలాడు.

ooo

నెల్లాళ్లు గడిచాయి.

ఈ రోజు సత్యమూర్తి రిటైర్‌మెంట్, డిప్యూటీ తహసిల్దారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు గవర్నమెంటు ఇచ్చే పదిహేను వందలు కాక, అందరూ తలో కొంత వేస్కొని ఘనంగా చేద్దామనుకున్నారు రిటైర్‌మెంట్ ఫంక్షన్.

ఆ ఉదయమే సత్యమూర్తి ఆఫీసు సూపరింటెండెంట్ గుర్నాధాన్ని పిలిచాడు.

ఆయన రాగానే "రండి. కూర్చోండి గుర్నాధం గారూ!" అన్నాడు సత్యమూర్తి.

"ఫర్వాలేదు సార్! చెప్పండి"

"మీరు కూర్చోండి ముందు"

గుర్నాధంగారు కూర్చున్నారు.

"ఈ రోజు ఫంక్షన్‌కు ఎంత ఖర్చు చేద్దామనుకుంటున్నారు?" ఊహించని ప్రశ్నకు గుర్నాధం కాస్త ఇబ్బంది పడ్డాడు.

"ఏదో...సార్ మీద అభిమానం కొద్ది తలో కొంత కంట్రిబ్యూట్ చేసుకుందామనుకుంటున్నాం సార్"

"అదే..ఎంత?"

గుర్నాధం చెప్పడానికి సంకోచించాడు.

"ఫర్వాలేదు. చెప్పండి"

"సుమారు ఓ పదిహేను వేలు సార్!"

"మీకు నా మీద ఏమాత్రం గౌరవం ఉన్నా ఒక సహాయం చెయ్యాలి. ఈ ఫంక్షన్ స్నాక్స్, టీతో సింపుల్‌గా ముగిద్దాం. దాని ఖర్చు నాది. మీరు కలెక్ట్ చేసిన మొత్తం ఓ సత్కార్యానికి ఉపయోగిద్దాం. అదీ మీకు ఇష్టమైతేనే" అన్నాడు సత్యమూర్తి.

"మీ ఫంక్షన్ మీ డబ్బుతో చెయ్యడమేమిటి సార్? అది పద్ధతి కాదు. మీరేదో సత్కార్యం అన్నారు. దాని గురించి తప్పక ఆలోచిద్దాం" అన్నాడు గుర్నాధం.

"ఇన్నిసార్లు మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం నాకిష్టం లేదు. దయచేసి ఆఖరిసారిగా నా మాట వినండి. అదే నాకు సరైన వీడ్కోలు" అన్నాడు సత్యమూర్తి దృఢంగా.

"సర్!"

"యంసెట్‌లో మంచి ర్యాంక్ వచ్చి, మెడిసిన్‌లో సీటొచ్చినా చదివే స్థోమతు లేని మా పనిమనిషి కూతురుకి ఆర్థిక సహాయం చేయమని అభ్యర్థిస్తున్నా. రేపు ఆమె డాక్టర్ అయితే ఎంతో మంది బీదల పాలిట ఆపద్బంధువు అవుతుంది. ఓ మంచి కార్యానికి మీ డబ్బు సద్వినియోగం అయితే అది మీకు శ్రేయస్కరమే కదా!"

"తప్పకుండా సర్! మీరన్నట్లుగా తప్పకుండా చేద్దాం. అలా అని ఫంక్షన్ మీ డబ్బుల్తో చేద్దామనడం పద్ధతిగా లేదు సార్"

"గుర్నాధంగారూ! ఇన్నాళ్లు నాతో ఉండి నా

గురించి తెలుసుకున్నది ఇంతేనా? మీరు నా పేరు మీద ఒక్క పైసా ఖర్చు చేసినా నాకు సన్మానం కాదు కదా అవమానమే" అన్నాడు సత్యమూర్తి.

సత్యమూర్తి నిజాయితీ గురించి అందరికీ తెలుసు. ఆఫీసు జీపు ఏనాడు స్వంత పనులకు ఉపయోగించ లేదు. ఆఫీస్‌దాకా పాత మోపెడ్ మీదే వచ్చేవాడు. అటెండరు చేత ఏనాడు సొంత పనులు చేయించుకుని ఎరుగడు.

"సరే సర్! మీరంతగా చెప్తే మేం ఏమనగలం. అలాగే కానిద్దాం సర్!" అన్నాడు గుర్నాథం.

సత్యమూర్తి అన్నట్లుగానే బిస్కట్లు, టీ, ఒకటి రెండు బొకేలతో ఆర్భాటం లేకుండా రిటైర్‌మెంట్ ఫంక్షన్ ముగిసింది.

ఆరోజు సత్యమూర్తి పెందరాళే నిద్రపోయాడు.

ooo

ఆనందరావు రిటైరయి నెల దాటింది. ఉద్యోగంలో ఉన్నప్పుడు ఎంతో హడావుడిగా, హుందాగా ఉండే పెద్దమనిషి బాగా డల్ అయిపోయాడు. ప్రొద్దు గడవటమే కష్టంగా ఉంది. లేచిన దగ్గర్నుంచి పడుకునే దాకా ఏం చెయ్యాలో తోచడం లేదు. ఉదయం లేచి ఈమధ్య మార్నింగ్ వాక్‌కు వెళ్లొస్తున్నాడు. రైతుబజార్‌కెళ్లి కూరగాయలు తనే మోసుకొస్తున్నాడు. ఆ తర్వాత పేపర్లు తిరగేయడం, టీవీ ఛానళ్లు మార్చడం ఇప్పుడు అడిగిన వెంటనే ఏ వస్తువూ రావడం లేదు. భార్య కూడా మాటి మాటికీ "ఉద్యోగం లేదుగా.. కంగారేమిటి?" అనో, "పనా పాటా? ఖాళీయేగా ఎక్కడకు వెళ్తారు?" అనడంలో ఆనందరావుకు ఏదీ అడగబుద్ధేయడం లేదు.

గతంలో అయితే "త్వరగా కాఫీ ఇయ్యి. కలెక్టర్‌గారి మీటింగ్ కెళ్లాలి" అనో, "అర్జెంటు! వీడియో కాన్ఫరెన్స్ ఉంది" అనో అనేవాడు. ఇప్పుడు "త్వరగా కాఫీ ఇవ్వు" అన్న తర్వాత ఏమనాలో తెలియడం లేదు. తన ఇంట్లో తనే పరాయివాడు అయిపోయాడు. మరోసారి కాఫీ అడగాలంటే సిగ్గేస్తోంది. భార్య మాట్లాడే తీరులో కూడా తనకేదో తేడా కనిపిస్తోంది. ఉద్యోగంలో ఉన్నప్పుడు ఎంత అగ్గగ్గులాడిపోయేది? రిటైర్డ్ లైఫ్ ఇంత నిస్సారంగా ఉంటుందా?

వెంటనే సత్యమూర్తి జ్ఞాపకం వచ్చాడు. సత్యమూర్తి కూడా రిటైర్ అయ్యాడు కదా! ఎలా ఉన్నాడో? ఆ ఆలోచన రాగానే సత్యమూర్తికి ఫోన్ చేశాడు.

"సత్యమూర్తి! ఎట్లా ఉన్నావ్? నేను.. ఆనందరావుని"

"నమస్కారం సార్! బాగున్నారా?"

"ఏం బాగు మూర్తి! అస్సలు టైం పాస్ కావడం లేదోయ్" అన్నాడు ఆనందరావు నిరుత్సాహంగా. "నీకెలా ఉంది సత్యమూర్తి?" తనే మళ్లీ అడిగాడు.

"నాకు టైం ఎక్కడుంది సార్! పాస్ కావడానికి?" అన్నాడు సత్యమూర్తి నవ్వుతూ.

"ఎలా?"

"ఒక్కరోజు నాతో గడపండి తెలుస్తుంది"

"సరే! రేపు ఉదయం వస్తా" అంటూ ముగించాడు ఆనందరావు.

మర్నాడు ఉదయమే సత్యమూర్తి ఇంటికి బయల్దేరాడు. ఊరు చివర కొబ్బరిచెట్లు, రకరకాల పూలమొక్కల మధ్య ఎంతో ప్రశాంత వాతావరణంలో చిన్న పర్ణశాలలా ఉంది. ఇంటి ముందు ముగ్గులు మరింత అందాన్నిస్తున్నాయి.

సత్యమూర్తి మార్నింగ్ వాక్‌కు వెళ్లొచ్చి 'యోగా' చేస్తున్నాడు. రావుగారు రాగానే యోగా ముగించి సాదరంగా ఆహ్వానించాడు.

ఓ పళ్లెంలో బొప్పాయి ముక్కలు, మొక్కపెసలు, ఓ గ్లాసుడు మజ్జిగ తెచ్చిచ్చాడు. ఆనందరావు తినే లోపు సత్యమూర్తి రెడీ అయి వచ్చాడు.

"మీ కారు ఇక్కడే ఉంచండి. నా మోపెడ్ మీద వెళ్దాం రండి"

ఆనందరావు అంగీకారం కోసం చూడకుండా తన మోపెడు బయటకు తీసి, స్టార్ట్ చేశాడు. ఆనందరావు వెనకాల కూర్చున్నాడు. తిన్నగా సెయింట్ జోసెఫ్ హాస్పిటల్‌కు పోనిచ్చాడు. అదో చారిటబుల్ ఇన్‌స్టిట్యూషన్. అక్కడ ఓ యాభై మంది ఎయిడ్స్ రోగులున్నారు.

"ఇదేమిటయ్యా ఇక్కడకు తీసుకొచ్చావ్?" ఆ ఎయిడ్స్ తనకెక్కడ వస్తుందో అన్నట్లుగా భయపడ్డాడు ఆనందరావు.

"రండి చెప్తా"

సత్యమూర్తి త్వరత్వరగా లోనికి నడిచాడు. ఆనందరావు అనుసరించాడు. సత్యమూర్తి ఆ ఎయిడ్స్ రోగులందర్నీ పలకరిస్తున్నాడు. వాళ్లతో నవ్వుతూ మాట్లాడుతున్నాడు. కరచాలనం చేస్తున్నాడు. కొందరికి మందులిచ్చాడు. కొంతమందిని లేవదీసి కూర్చోబెట్టాడు. అలా ఓ గంట సపర్యలు తర్వాత "పదండి" అన్నాడు సత్యమూర్తి.

మళ్లీ మోపెడ్ స్టార్ట్ అయింది. ఆనందరావు వెనకాల కూర్చున్నాడు. ఈసారి 'ఆశ్రమ శ్రావణ' దగ్గర ఆగింది. అదో వృద్ధుల ఆశ్రమం. ఓ అరవై మంది వృద్ధులున్నారు.

సత్యమూర్తి త్వరత్వరగా లోపలికి నడిచాడు. ఆనందరావు అనుసరించాడు. సత్యమూర్తి అక్కడ పెద్దవాళ్లందర్నీ పలుకరిస్తున్నాడు. మరీ లేవ లేని వృద్ధులు ఇద్దరికీ దగ్గరుండి స్నానాలు చేయించి, పంచె కట్టి పడుకోబెట్టాడు. గది లోంచి బయటకు రాలేని వృద్ధులకు భోజనశాల లోంచి కాఫీ, ఫలహారాలు పట్టుకెళ్లి ఇచ్చాడు. అలా ఓ గంటన్నర గడిచింది. ఆనందరావు నిశ్శబ్దంగా అంతా గమనిస్తున్నాడు. సత్యమూర్తి ఎక్కడా గొప్ప కోసమో, పేరు కోసమో ఏదో ఆశించి చేస్తున్నట్లు



## గ్రేసీ దశ తిరిగేనా?

తొలిచిత్రం 'లగాన్' మలిచిత్రం 'మున్నాభాయ్ ఎంబీబీఎస్' బంపర్ హిట్ సినిమాలే అయినా గ్రేసీ సింగ్ కెరీర్ మాత్రం నత్తనడకనే సాగింది. అలాగే తెలుగులో ఆమె తొలిచిత్రం 'సంతోషం' కూడా హిట్ చిత్రమే. కానీ గ్రేసీకి చెప్పుకోదగిన ఆఫర్లు రాలేదు. మళ్లీ ఇన్నాళ్లకి ఆమె ఓ తెలుగు సినిమాలో నటిస్తోంది. ఇందులో అబ్బాస్ హీరోగా నటిస్తున్నాడు. హిందీలో ఎలాగూ అవకాశాలు లేవు, తెలుగులో అయినా ఆమె దశ తిరుగుతుందేమో!

కనపడలేదు. చేస్తున్న పనిలో ఎంతో ఆనందాన్ని అను భవిస్తున్నాడు. ఆనందరావు సైలెంట్‌గా కూర్చోలేకపో తున్నాడు. అప్పటికీ ఉదయం పదకొండు గంటల య్యింది.

సత్యమూర్తి మళ్లీ మోపెడ్ స్టార్ట్ చేశాడు. ఇద్దరూ బయల్దేరారు.

"మళ్లీ ఎక్కడికి?" ఆనందరావు అడిగాడు.

"ఇంటికే సార్!" అన్నాడు సత్యమూర్తి.

పది నిముషాల్లో ఇంటి ముందున్నారు. ఇంటి ముందు అయిదారుగురు.. పనివాళ్లలా ఉన్నారు.. ఎదు రుచూస్తున్నారు. ఆనందరావు వాళ్లని కూర్చోమని, ఇంట్లోకెళ్లి ఓ కిట్ తెచ్చాడు. ఆ కిట్ నిండా చిన్న చిన్న బాటిల్స్‌తో హోమియో మందు లున్నాయి. ఆ వచ్చిన వాళ్లంతా వాళ్లవాళ్ల బాధలు చెప్తుంటే సత్యమూర్తి మందులిస్తున్నాడు. ఆనందరావు ఇదంతా ఆశ్చ ర్యంగా చూస్తున్నాడు.

వాళ్లందరూ వెళ్లిపోయాక ఆనందరావు అడిగాడు "ఈ హోమియో వైద్యం ఎప్ప ట్నుంచి?" అని.

"నా చిన్నపుడు మా పక్కిం టిలో ఆచార్యులుగారుండే వారు. ఆయనెంతో సేవాభా వంతో వైద్యం చేస్తుండేవారు. ఇది నలుగురికి చౌకగా దొరికే వైద్యమని ఆయన దగ్గర నేర్చు కున్నా, ఇది నాకు వృత్తి కాదు. నలుగురికి సహాయం చేశామని తృప్తి"

"ఇక ఇప్పట్నుంచి ఖాళీ యేగా! ఇక నుంచి టైం ఎలా పాస్ అవుతుంది?" ఆనంద రావు కుతూహలంగా అడి గాడు.

"భోజనం అయ్యాక ఓ గంట విశ్రాంతి. ఆ తర్వాత ఏదో గ్రంథపఠనం. సాయంత్రం నాలుగు నుంచి ఆరుదాకా దేవాలయాల్లో నారా యణసేవ. ఆరు నుంచి ఎనిమిది దాకా అనాథాశ్ర మంలో పిల్లలకు ఉచిత ట్యూషన్. రేపు కిరణ్ ఆసుపత్రి వారి ఫ్రీ ఐ క్యాంప్. ఎల్లుండి కాటరాక్ట్ ఆపరేషన్స్. ఇది కాక, నలుగురు స్నేహితులతో ఓ ట్రస్ట్ ఏర్పాటు చేశాం. అనాథలకు దాని ద్వారా అన్ని రకాల సహా యాలు ఏర్పాటు చేస్తాం. రోజూ సాయిబాబా గుడిలో అన్నదానం చేస్తాం. ఎవ్వర్నీ విరాళాలు అడగం. కొంత మంది యన్నారై మిత్రులు ఫండ్స్ డిపాజిట్ చేశారు. ఆ వచ్చే వడ్డీ ఆదాయంలోంచే అన్నీ" సత్యమూర్తి అన్నీ వివరంగా చెప్పాడు.

ఇద్దరూ భోజనానికి కూర్చున్నారు. సత్యమూర్తి ఇంట్లో డైనింగ్ టేబుల్ లేదు. నేల మీద పీటలు వేసి అరటి ఆకుల్లో వడ్డించారు. ఆ ఇల్లాలి వంట, వడ్డన, వినయం ఆనందరావుని ముగ్ధుడ్ని చేశాయి. ఓ చిన్న టీవీ తప్ప, సోఫాగానీ ఖరీదైన వస్తువులు గానీ కనపడలేదు. ఆ ఇంటిని చూస్తేనే సత్యమూర్తి నిజాయితీ అర్థమవుతుంది.


"మీకు ఒక్కడే అబ్బాయి కదా! ఏం చేస్తున్నాడు?" ఆనందరావు అడిగాడు.

"అందర్లా ఇంజనీరింగ్, మెడిసిన్ చదివించే స్థోమతు లేదు. డిగ్రీ చదివాక బి.ఇడి చేశాడు. ఈ పక్క ఊళ్లోనే టీచర్. ఉదయం పోయి సాయంత్రం వస్తాడు"

'తన బిళ్లబంట్రోతు కొడుకు ఇంజనీరింగ్ చదువు తూంటే తాసిల్దార్ కొడుకు స్కూలు టీచర్' ఆనంద రావు ఆశ్చర్యపోయాడు.

ఆనందరావులో అంతర్మథనం ప్రారంభ మయ్యింది.

'సత్యమూర్తి భార్యాపిల్లలకి ఏమీ సంపా దించి ఇవ్వకపోయినా మంచి సంస్కారాన్ని ఇచ్చాడు. పది మందికి సహాయపడే మంచి మనస్సు ఇచ్చాడు. మానవత్వాన్ని పంచాడు. తను ఎన్నో అడ్డదార్లు తొక్కి ఎంతో సంపాదిం చాడు. ఇళ్లు, పొలాలు, నగలు, నగదు అన్నీ ఉన్నాయి. పిల్లల్నిడాక్టర్‌గా, ఇంజనీరుగా చేశాడు. వాళ్లు తననో డబ్బు సంపాదించే యంత్రంగానే చూశారు. ఈ యంత్రం ఇప్పుడు మూలపడింది. దాంతో అందరికీ అలుసు. తను ఏనాడూ తన కుటుంబానికి తప్ప ఎవరికీ సహాయం చేసి ఎరుగడు. కనీసం ఈ 'రెండో ఇన్నింగ్స్' అయినా మనస్సున్న మనిషిగా బ్రతకాలి. ఈ సమాజం మనకన్నీ ఇచ్చింది. ఈ సమాజం కోసం, ఈ మనుషుల కోసం ఏదైనా చేయడానికి ఇదే సరైన సమయ మని సత్యమూర్తి తనకి ప్రాక్టికల్‌గా నిరూపిం చాడు. తన కళ్లు తెరిపించాడు. సత్యమూర్తి ముందు తను మరుగుజ్జులా ఉన్నాడు. తను బాగా ఎదగాలి. కాదు.. తను బాగా మారాలి. పేపర్లు చదువుతూ, ఛానల్లు మారుస్తూ తను వృథా చేసే సమయంలో ఎందరో ఆర్తులను ఆదుకోవచ్చు. సత్యమూర్తి తనకు మార్గదర్శి. రేపట్నుంచీ తను కూడా బిజీయే' ఆనందరావు దృఢంగా ఓ నిర్ణయానికి వచ్చాడు.



## నా డ్రెస్సు నా ఇష్టం

సినిమాల్లోనే కాకుండా బయట కూడా కురచ డ్రెస్సులతో దర్శనం ఇచ్చి సంచలనం సృష్టించడం శ్రియకు అలవాటే. దీని గురించి ఇటీవల ఆమె మాట్లాడుతూ- 'ఎవరి డ్రెస్సులు వారిష్టం. ఇలాగే బట్టలు ధరించాలి అని ఒకరి గురించి మరొకరు సూచిం చడం నాకు నచ్చదు. నేనెలా బాగా కనిపిస్తానో నాకు తెలీదా? అందుకే ఇలాంటి కామెంట్లు నేను పట్టించుకోను' అంటూ కొట్టి పారేసింది.